# మన ఆచారములు - అంతరార్థములు

- నిత్యానంద్.

## పెళ్ళి తంతు - విలువలు

పెళ్ళి అనగానే మనకు గుర్తువచ్చే సన్నివేశములు బాసికధారణ, జీలకర్ర - బెల్లం శిరస్సుపై నుంచడం, మంగళసూత్రధారణ, తలంబ్రాలు, అంగుళీకాలు తీయడం, ఉయ్యాలలోని బొమ్మను అప్పజెప్పడం మొదలైనవి. బ్రహ్మచర్యము, గృహస్థము, వానప్రస్థము, సన్యాసము అనెడి ఆశ్రమ ధర్మములలో గృహస్థాశ్రమము ప్రత్యేకమయినది. చతుర్విధ పురుషార్థములలో చివరిదైన మోక్షమునకు మొదటి మెట్లయిన ధర్మ, అర్థ, కామములు సంప్రాప్తమవడానికి దోహదపడుతుంది. 'పెళ్ళంటే నూరేళ్ళపంట' అని పెద్దలన్నట్లు, వివాహబంధము వధువు, వరులను ఒకటిగా చేస్తుంది. ఇక పెళ్ళిలో 'అంగుళీకాలు తియడం', 'తలంబ్రాలు', 'ఉయ్యాలలోని బొమ్మను అప్పజెప్పడం' మొదలైనవి ఆటలమాదిరిగా అగుపిస్తాయి. ఇంతకీ వీటి ప్రాముఖ్యము ఏమిటి?

గతంలో భారతదేశముపై అనేకులు దండయాత్రలుచేసి, జయించి, రాజ్యపాలన చేసారు. ఇస్లాం రాజ్యపాలకులు ఎంతమంది స్త్రీలనైనా వివాహమాడుటకు అభ్యంతరము లేకపోవడం వలన, వయస్సుతో నిమిత్తములేకుండా మనసు పడిన మగువలను బలవంతంగానైనా పెళ్ళి చేసుకునేవారు. వివాహిత స్త్రీలను వారు గౌరవించేవారు. ఆ కారణముగానే బాల్యవివాహములు చెయ్యడం మొదలయిందని కొందరి వాదన. ఆ కారణంగానే పెళ్ళితంతులో వధూవరులను (బాల్యంలో ఉన్న పిల్లలను) ఆటపాటలతో కూడిన కార్యక్రమాలతో ఆసక్తిని కలిగించేలా ఏర్పాటు చేసారని; ఆటపాటల్లోపడి పిల్లలు సఖ్యతని కుదుర్చుకుని మంచి స్నేహితులుగా మెలగాలని, ఆ కారణంగానే తలంబ్రాలు, సన్నని మూతిగల బిందెలోనుండి ఉంగరలు తియ్యడం లాంటివి పెళ్ళి తంతులో భాగమయ్యాయని అనడంలో కొంత నిజముందని అనిపిస్తుంది.

కాని పెళ్ళి తంతులోని చాలా కార్యక్రమములకు ఎంతో విశేషముంది. పెళ్ళిలోని కొన్ని సన్నివేశాల అంతరార్థము గురించి తెలుసుకునే ప్రయత్నం చేద్దాం!

**బాసికధారణ** : మానవ శరీరంలో ఇడ, పింగళ, సుషుమ్న అనే మూడు ముఖ్యమైన నాడులున్నాయి. జడవెయ్యడములో మూడు పాయలు తియ్యడం కూడా ఇడ, పింగళ, సుషుమ్న నాడులను ఉత్తేజపరచడానికే. ఇక జడగంటలు కట్టడం వలన మూడు పాయలపై స్థిరమైన ఒత్తిడి ఉంటుంది. వీటిలో సుషుమ్న నాడికి కుడివైపు సూర్యనాడి, ఎడమవైపు చంద్రనాడి ఉంటాయి. ఇవి రెండూ కలిసే ప్రదేశం భ్రూమధ్యం (అంటే కనుబొమ్మలు కలిసే ప్రదేశం, తిలకధారణ చేసే ప్రదేశం అన్నమాట!). దీనిపై ఇతరుల దృష్టి పడకుండా వధూవరులకు బాసికధారణ చేస్తారు.

**జీలకర్ర - బెల్లం** : పూర్వం పెళ్ళి పదహారు రోజులు జరిపేవారు. నేడు తాహతును బట్టి ఒకటి నుండి మూడు రోజులతో సరిపెడుతున్నారు. నేటికీ పెళ్ళి తరువాత పదహారు రోజుల పండగ అని జరపడం చూస్తుంటాం. అయితే అన్ని రోజులు పెళ్ళి కార్యక్రమాలతో, నిద్రలేమితో అలసి ఉన్న వధూవరులకు చలువచేయడానికి 'జీలకర్ర - బెల్లం' తమలపాకుపై నుంచి దానిని తలపై ఉంచడం జరుగుతుంది.

**మంగళసూత్రధారణ** : సూత్రము అనగా తాడు (బంధము) అని, నియమము అని అర్థములు. మంగళకరమైన బంధము కాబట్టి మంగళసూత్రముగా వ్యవహరించబడుతున్న తాళిలో రెండు సూత్రములు - ఒకటి వధువు పుట్టినింటి గౌరవ ప్రతిష్ఠలని, రెండవది వధువు మెట్టినింటి గౌరవ ప్రతిష్ఠలని కాపాడుకోవాలని సూచిస్తాయి. పూర్వం భార్య ఇంటనే ఉండి సంసారము చక్కగా తీర్చిదిద్దడం, భర్త సంపాదన చెయ్యడం జరిగేది. ఇంటిపని ముగించిన పిదప పొరుగువారితో మసలునపుడు ఇటు పుట్టినింటికి గాని, మెట్టినింటికిగాని చెడ్డపేరు తెచ్చేపని చెయ్యకూడదని గుర్తుచెయ్యడానికే మంగళసూత్రధారణ చేసేవారని స్పష్టమౌతుంది.

**తలంబ్రాలు** : క్షత: అనగా విరుగునది. అక్షత: అనగా విరుగనిది. 'తలంబ్రాలు' పోయడంద్వారా వివాహబంధం విడదీయరానిదని గుర్తుచేస్తుంది. అలాగే 'తలన్ + బ్రాలు' అంటే తలపైనుండి క్రిందికి జారునవి అని అర్థం. ప్రేమాభిమానములు కూడా అటులనే జాలువారునని ఒకరికొకరు ప్రమానము చేసికొనడం దీని ముఖ్యోద్దేశ్యము.

**అంగుళీకాలు తీయడం** : మూతి సన్నగా ఉన్న బిందె నుండి ఉంగరము తియ్యడములో స్పర్శ సాన్నిహిత్యం పరిచయంలేని వధూవరులు ఒకరి స్పర్శనొకరు మొదటిసారిగా అనుభవిస్తారు. దీనికారణముగా వారి మధ్య బిడియము పోయి, గెలుపు మరియు ఓటమిని సమదృష్టితో చూసే గుణం కలుగుతుంది.

**ఉయ్యాలలోని బొమ్మను అప్పజెప్పడం** : ఉయ్యాలలోని బొమ్మను అప్పజెప్పడం ద్వారా సంసారజీవితములో భార్య, భర్త ఇద్దరూ బాధ్యతలను సమంగా పంచుకొని, అన్యోన్య దంపతులుగా జీవించాలనే విషయాన్ని గుర్తుచేస్తుంది.

## పంచసూనలు అంటే?

సూన అంటే కమేలా, గొఱ్ఱెలు, మేకలు కోయుస్థలము. 1.కత్తితో తరిగేటప్పుడు 2. తిరుగలితో విసిరేటప్పుడు 3. పొయ్యిని మండించేటప్పుడు 4. నీళ్ళు నింపేటప్పుడు 5. చీపురుతో చిమ్మేటప్పుడు అంతో ఇంతో జీవహింస జరుగుతుంది. ఇలా మనకు తెలియకుండా చేసే పాపములు పంచసూనలు. దానినుండి ప్రాయశ్చిత్తం చేసుకోడానికి 1. దేవ యజ్ఞం 2. ఋషియజ్ఞం (బ్రహ్మ యజ్ఞం) 3. పితృయజ్ఞం 4. మనుష్యయజ్ఞం 5. భూతయజ్ఞం అనే పంచ మహాయజ్ఞములు చెయ్యాలి.